క్లుప్తంగా

వైభవంగా విగ్రహ ప్రతిష్ట



గడ్డమీదపల్లిలో సీతారాముల పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే అమర్నాథరెడ్డి

సుండుపల్లి : మండల కేంద్రంలో సొరంవారిపల్లి దగ్గర శనివారం శ్రీ మారెమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. రాజంపేట నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం గడ్డమీదపల్లి గ్రామంలో సీతారాముల కల్యాణ మహోత్సవంలో పాల్గొని స్వాముల వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గ్రామాలలోని ప్రజలందరూ దేవుని కృపతో ఆయురారోగ్యాలు, సిరి సంపదలతో ఎల్లవేళలా సంతోషంగా ఉండాలన్నారు. ప్రజలకు ఏమైనా సమస్యలు వస్తే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆరం రెడ్డి, జెడ్పీటీసీ ఇస్మాయిల్, సర్పంచ్ రామచంద్ర, ఎంపీటీసీలు నాగేశ్వరరావు, చంద్ర నాయక్, బాబు, చింటూరెడ్డి, సల్మాన్‌లు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



ఎస్‌ఐ భక్తవత్సలం

సంబేపల్లె : సంబేపల్లె ఎస్‌గా యం.భక్తవత్సలం శనివారం బాధ్యతలు చేపట్టారు. రాయచోటి టౌన్‌లో విధులు నిర్వహిస్తూ సంబేపల్లెకు బదిలీ అయ్యారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్‌ఐ రామకృష్ణ గాలివీడుకు బదిలీపై వెళ్లారు.

పాఠశాలకు జిరాక్స్ మిషన్ల వితరణ



జిరాక్స్, స్కానర్ మిషన్‌ను అందజేస్తున్న వీరారెడ్డి

నందలూరు : మండలంలోని పాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అదే పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేసి పదవీ విరమణ పొందిన కె.వీరారెడ్డి జిరాక్స్, స్కానర్ మిషన్లు వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాటూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దాదాపు 8 ఏళ్లు ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించానన్నారు. పాఠశాలలోని ఉపాధ్యాయులతోపాటు ప్రజలు, విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి ఎంతో సహకరించారని, తన వంతు బాధ్యతగా జిరాక్స్, స్కానర్ మిషన్‌ను అందజేయడం జరిగిందన్నారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవిలత, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు వీరారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

బదిలీపై వెళ్లిన ఎస్‌ఐకు సన్మానం



ఎస్‌ఐ పెద్ద ఓబన్నను సన్మానిస్తున్న సీఐ, పోలీసులు

సిద్దవటం : సిద్దవటం ఎస్‌ఐ పెద్ద ఓబన్న తొండూరు ఎస్‌ఐగా బదిలీ కావడంతో స్థానిక పోలీసు స్టేషన్‌లో శనివారం ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఒంటిమిట్ట సీఐ మోహన్‌కుమార్ మాట్లాడుతూ ఎస్‌ఐ పెద్దఓబన్న మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్‌రాజు, పోలీసులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ



పాఠశాలను పరిశీలిస్తున్న ఆర్‌జేడీ శ్యామ్యూల్

సుండుపల్లి : మండల కేంద్రంలోని మాధురీ స్కూల్‌ను ఆర్‌జేడీ శ్యామ్యూల్ శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్య విలువను ప్రతి విద్యార్థికి చేరవేయాలని తెలిపారు. స్కూల్‌లో ఉన్న మౌలిక వసతులు, ఫీజుల వివరాలు, పాఠశాల స్థితిగతులను క్షుణ్ణంగా పరిశీలించారు. విశాలమైన ఆటస్థలం, ఆహ్లాదకరమైన వాతావరణంలో పాఠశాల ఉండటంతో యాజమాన్యాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 రవీంద్ర నాయక్, మాధురి స్కూల్ కరస్పాండెంట్ రేపన సుధాకర్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు వైద్యశిబిరం

గుర్రంకొండ: మండలకేంద్రమైన గుర్రంకొండలో ఆదివారం ఉచిత కంటివైద్యశిబిరం నిర్వహించనున్నట్లు రీడీ సంస్థ ప్రధాన కార్యదర్శి ఐలా ఈశ్వరయ్య తెలిపారు.

సేంద్రియం.. పంటకు జీవం

- ఖర్చు తక్కువ.. దిగుబడి ఎక్కువ
- అధికంగా పోషకాల శాతం
- ఆసక్తి చూపుతున్న రైతులు



పొలంలో కుప్పలుగా వేసిన ఎరువు

రైల్వేకోడూరు అర్బన్ : ప్రస్తుత వ్యవసాయంలో వాతావరణ పరిస్థితుల మార్పు కారణంగా.. చాలా మంది రైతులు మళ్లీ సేంద్రియ సేద్యం వైపు ఆసక్తి చూపిస్తున్నారు. వ్యవసాయ అధికారులు కూడా ప్రోత్సహిస్తున్నారు. అధునాతన విధానాలు అమలు చేస్తున్నప్పటికీ సేంద్రియ ఎరువులు ఉపయోగించేలా వ్యవసాయ అధికారులు కృషి చేస్తున్నారు. రసాయన ఎరువుల వాడకం వల్ల కలుగుతున్న అనర్థాలను గుర్తించిన రైతులు భూసారం పెంపుపై దృష్టి సారిస్తున్నారు. సేంద్రియ ఎరువులైన పశువుల పేడ, కోడి ఎరువు, చెరువుమట్టి పొలాలకు తరలిస్తున్నారు. కొంత కాలంగా తరచూ రసాయన ఎరువుల వాడకం వల్ల భూసారం తగ్గి పంటలకు చీడపీడలు సోకి.. దిగుబడులు తగ్గిపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. దీంతో తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు ఇచ్చే సేంద్రియ ఎరువుల వైపు దృష్టి పెడుతున్నారు. కొంత కాలంగా భూమిని కలియ దున్ని సేంద్రియ ఎరువులైన పేడదిబ్బలు, చెరువు మట్టి పోసి వీలయినంత త్వరగా కలియ దున్ని మట్టిలో కలిసిన వెంటనే సేద్యం చేస్తున్నారు. ఈ విధానం వల్ల మంచి ఫలితాలు ఇస్తాయని చెబుతున్నారు.

ఎలా నిల్వ చేసుకోవాలంటే..

పంటకు పశువుల ఎరువు వేయకపోతే ఆ ప్రభావం దిగుబడిపై తప్పక చూపుతుంది. పశువుల ఎరువు పంటకు సంజీవని వంటిదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. పశువుల పేడను గ్రామీణ ప్రాంతాలలో ఎక్కడ పడితే అక్కడ వేస్తుంటారు. అలాకాకుండా పాడి రైతులు పేడను ఒక పక్క చేర్చి దిబ్బగా ఉంచాలి. అలాగే పశువుల కొట్టంలో పశువుల వద్ద పేరుకుపోయిన చెత్త, మూత్రంను ఒక చోట చేర్చి.. సమానంగా దిబ్బపై వేసి నిల్వ ఉంచాలి. కొన్ని రోజులకు పొలాలకు తరలించవచ్చు. తరువాత పొలాలకు చేర్చిన దిబ్బలను ఒక చోట చేర్చి.. అర అడుగు మందంతో మట్టిని పరిచి దానిపై దిబ్బ ఎరువును అడుగున్నర మందంతో వేయాలి. ఇలా రెండు, మూడు వరుసలు వేసిన 20 రోజులకు బాగా మగ్గుతుంది. తరువాత పొలంలో కుప్పలుగా పోసిన వెంటనే చల్లాలి. తరువాత ఒక మారు దున్ని పంట సాగు చేస్తే పంటకు పోషకాలు బాగా పడతాయి. ప్రస్తుతం పలువురు రైతులు ఈ విధానాన్ని కొనసాగిస్తున్నారు.

రైల్వేకోడూరు నియోజకవర్గం

వ్యవసాయ భూమి: 49,400 ఎకరాలు

రైతులు: 27,793

సేంద్రియ ఎరువులు వాడుతున్న భూమి: 16,200 ఎకరాలు

సేంద్రియ ఎరువుల్లోని పోషకాలు

సేంద్రియ ఎరువు	నత్రజని	భాస్వరం	పొటాష్
పశువుల ఎరువు	1.5	0.9	1.9
కోళ్ల ఎరువు	3.0	3.0	2.0
గొర్రె, మేకల ఎరువు	0.1	0.6	3.0
వర్మీకంపోస్టు	3.0	2.2	1.7
గ్రామీణ కంపోస్టు	1.0	0.8	1.2
పట్టణ కంపోస్టు	2.0	3.3	2.0
వేరుశనగ పిండి చెక్క	7.5	1.3	1.5
వేపపిండి	5.6	1.1	1.5
ఆముదం పిండి	4.4	1.9	1.4
కానుగపిండి	4.0	1.0	1.4
జీలుగ	0.62	0.15	0.10
జనుము	0.75	0.12	0.61
అలసంద	0.71	0.15	0.68
పిల్ల పెసర	0.72	0.10	0.53

ఖర్చులు తగ్గుతాయి



పశువుల ఎరువును వాడితే ఖర్చులు తగ్గుతున్నాయి. దుక్కులకు ముందే సేంద్రియ ఎరువులు పొలంలో కలియ దున్నితే భూసారం పెరుగుతుందనే పాత కాలం పద్ధతిని కొనసాగిస్తూ.. పశువుల ఎరువును వాడి ఖర్చులు తగ్గిస్తున్నాం. దీనివల్ల తెగుళ్ల తగ్గాయి. పంటల దిగుబడి ఎక్కువగా ఉంటుంది.

–సామానేని శ్రీనివాసులు, రైతు, కొత్తపల్లి, ఓబులవారిపల్లి మండలం

పంటకు ఎన్నో ప్రయోజనాలు



సేంద్రియ ఎరువులను వాడడం వల్ల పంటకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. పశువులపేడ, చెరువుల పూడిక మట్టిని పొలాలలో వేయడం వల్ల భూమిలో తేమశాతం ఎక్కువ రోజులు వుంటుంది. దీనివల్ల పోషకాలు అందుతాయి. సేంద్రియ ఎరువులు వాడిన పొలాలలో చీడ పీడలు, తెగుళ్ల తక్కువగా ఉంటాయి. నాణ్యమైన దిగుబడి వస్తుంది.

–రమేష్, వ్యవసాయ శాఖ అధికారి, రైల్వేకోడూరు

ఆలయాల్లో శ్రావణమాస పూజలు



రాయచోటిలో ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

రాయచోటి టౌన్ : ఆలయాల్లో శ్రావణ మాసం తొలి శనివారం విశేష పూజలు నిర్వహించారు. రాయచోటి – రాజంపేట రోడ్డులోని శ్రీ ఆంజనేస్వామి ఆలయంలో అభిషేకాలు చేశారు. భక్తులకు దాతల సహకారంతో అన్నప్రసాదం అందజేశారు.

సంబేపల్లె : మండలంలోని గుట్టపల్లె, సంబేపల్లె, పీఎస్ కాలనీ, దుద్యాల, గున్నికుంట్ల, మోటకట్ల, శెట్టిపల్లె, రౌతుకుంట, దేవపట్ల గ్రామాలలోని శ్రీ ఆంజనేయస్వామి మూల విరాట్‌లను నూతన వస్త్రాలతో అలంకరించారు. అర్చన, ఆకుపూజ, సింధూరార్చన వంటివి నిర్వహించారు.

గాలివీడు : మండల కేంద్రంలోని బ్రాహ్మణ వీధిలో శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడు ఆనందచార్యులు నైవేద్యాలు సమర్పించారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

చిన్నమండెం : మండల వ్యాప్తంగా పలు ఆంజనేయస్వామి ఆలయాలలో ఆకు పూజలు నిర్వహించారు.

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలోని శ్రీవెంకయ్యస్వామి దేవస్థానంలో శనివారం భజనలు చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా రాములోరి కల్యాణం

రామాపురం : మండలంలోని కల్పనాయినిచెరువు గ్రామం అగ్రహారంలో మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న హనుమ సమేత సీతారామలక్ష్మణ స్వాములు, ధ్వజ విగ్రహ యంత్ర ప్రతిష్ట మహోత్సవం శనివారం ముగిసింది. అనంతరం సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. మూలవర్లు, ఉత్సవమూర్తుల గ్రామోత్సవం చేపట్టారు. భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలను దాత ఎర్రాని నరసింహులు కుటుంబ సభ్యులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహించారు.

శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయం

పీలేరు రూరల్ : శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయమని యుగంధర్ బిస్మిల్లా తెలిపారు. పీలేరు అర్బన్ సీఐగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన యుగంధర్ బిస్మిల్లా ఆటో యూనియన్ శనివారం నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఆటోల సంఖ్య ఎక్కువగా ఉన్నాయని, నిబంధనలకు లోబడి ఆటోలు నడపాలని సూచించారు. అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆటో యూనియన్ నాయకులు బోడేషా, ఖాసీం సాహెబ్, సురేష్‌బాబు, సదాశివకుమార్, భాస్కర్, వెంకటరమణ, భాషా పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో డెంగీ పంజా



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి రక్షిత

తంబళ్లపల్లె: తంబళ్లపల్లెలో డెంగీ విజృంభిస్తోంది. ముగ్గురు చిన్నారులకు డెంగీ సోకడంతో కలకలం రేపింది. తంబళ్లపల్లె మండల కేంద్రంలో ముగ్గురు బాలికలకు డెంగీ జ్వరం నిర్ధారణ కావడంతో ఆందోళన కలిగిస్తోంది. తంబళ్లపల్లె మండల కేంద్రానికి చెందిన రక్షిత (10) రెడ్డికీర్తన (9), సిద్దారెడ్డిపల్లెకు చెందిన కవిత (14) ముగ్గురు బాలికలు నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నారు. వీరిని శుక్రవారం కుటుంబ సభ్యులు చికిత్స కోసం తంబళ్లపల్లె ప్రభుత్వాస్పత్రికి తీసుకువచ్చారు. డెంగీ అనుమానిత లక్షణాలు ఉండటంతో ర్యాపిడ్ పరీక్షలు నిర్వహించగా పాజిటివ్ వచ్చినట్లు వైద్యాధికారి వెంకటరామయ్య తెలిపారు. అప్రమత్తమైన వైద్యాధికారి ఇద్దరు బాలికలను రక్షిత, కవితలను ఆస్పత్రిలో అడ్మిట్ చేసుకుని చికిత్స చేస్తున్నారు.

ఫ్రీ హోల్డ్ భూముల పరిశీలన

మదనపల్లె : మండలంలోని చీకలబైలు, వేంపల్లె, మాలేపాడు, పెంచుపాడు, కోళ్లబైలు గ్రామాల్లోని ఫ్రీహోల్డ్ భూములను శనివారం తహసీల్దార్ ఖాజాబీ పరిశీలించారు. మండల సర్వేయర్ సుబ్రహ్మణ్యం, ఆర్‌ఐ రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

మోటార్ల దొంగలు.. రైతులు బెంబేలు







బోరుబావి మోటారును బయటకు లాగి కాపర్ వైరును తీసుకెళ్లిన దృశ్యం

- కాపర్ వైరు లక్ష్యంగా దొంగతనాలు
- అరికట్టాలని అన్నదాతల వేడుకోలు

లక్కిరెడ్డిపల్లి : బోరుబావుల మోటార్ల దొంగలతో రైతులు బెంబేలెత్తుతున్నారు. మండలంలోని మద్దిరేవుల, కస్తూరిరాజుగారిపల్లె, కుర్నూతల తదితర గ్రామాల్లో రెండు నెలల నుంచి రోజూ ఏదో ఒక ప్రాంతంలో చోరీలు జరుగుతున్నాయి. బోరుబావులలోని మోటార్లను లాగేసి అందులోని కాపర్ వైరు, స్టార్టర్లు తీసుకెళ్తున్నారు. కొన్ని చోట్ల ఏకంగా మోటార్లనే ఎత్తుకెళ్తున్నారు. మోటార్ల కేబుల్ వైరులో ఉండే కాపర్ వైరు లక్ష్యంగా దొంగతనాలు జరుగుతున్నాయి. ఆగని దొంగల బెడదతో రైతులు వేలాది రూపాయలు నష్టపోతున్నారు. తాజాగా శుక్రవారం రాత్రి మండలంలోని కస్తూరిరాజుగారిపల్లె, గురవయ్యగారిపల్లె సమీపంలో రైతులు వెంకటసుబ్బయ్య, రెడ్డయ్య, వేణు, పెద్దఓబయ్యకు సంబంధించిన మోటార్ల స్టార్టర్లు, కేబుల్ వైర్లు అపహరించారు. నెల రోజుల వ్యవధిలోనే మద్దిరేవుల గ్రామంలోని రెడ్డివారిపల్లె, అప్పలరాజుగారిపల్లెకు చెందిన రైతులు అశోక్ రాజు, నరేష్ రాజు బోర్ల వద్ద కేబుల్ వైర్లతోపాటు విద్యుత్ సబ్ లైన్ వైర్లు దొంగలు ఎత్తుకెళ్లారు. అసలే కరువు ప్రాంతమైన లక్కిరెడ్డిపల్లి మండలంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో బోర్లలో వస్తున్న అరకొర నీటితో మామిడి తోటలను కాపాడుకుంటూ ఉన్నామని, ఇలాంటి పరిస్థితులలో దొంగల బెడద కంటి మీద కునుకు లేకుండా చేస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు దొంగలను పట్టుకోకపోతే తాము తీవ్రంగా ఇబ్బంది పడాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. ఈ విషయంపై లక్కిరెడ్డిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

మోటార్లు, కేబుల్ వైర్లు ఎత్తుకెళ్లారు



నాకు ఐదు ఎకరాల మామిడి తోట ఉంది. అందులో ఒక బావి, మూడు బోర్లు ఉన్నవి. శుక్రవారం రాత్రి దొంగలు మూడు మోటార్లను బయటికి లాగి స్టార్టర్లతోపాటు కేబుల్ వైరు మొత్తం కట్ చేసి బోరును కూడా పగులగొట్టారు. నాకు రూ.50 వేల వరకు నష్టం జరిగింది. కరువు కాలంలో పంటలు రాక ఇబ్బంది పడుతుంటే.. ఆపై దొంగల బెడదతో తీవ్రంగా నష్టం చవిచూడాల్సి వస్తుంది. పోలీసులు చొరవ చూపకపోతే మాలాంటి పేద రైతులు అప్పులు పాలు కాక తప్పని పరిస్థితి.

– వెంకటసుబ్బయ్య, గురవయ్యగారిపల్లి, లక్కిరెడ్డిపల్లి మండలం

రూ.20 వేల నష్టం వాటిల్లింది



నాకు ఉన్న నాలుగు ఎకరాలలో మామిడితోటతోపాటు కూరగాయల పంటలు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాను. శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దొంగలు నా మోటార్‌కు ఉన్న కేబుల్ వైర్లు మొత్తం లాగేసి ఎత్తుకెళ్లిపోయారు. నాకు రూ.20 వేలకు పైగా నష్టం వాటిల్లింది. ఈ విషయంపై లక్కిరెడ్డిపల్లె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తాం. పోలీసులు దృష్టి సారించి దొంగలను అదుపులోకి తీసుకోకపోతే రైతుల పరిస్థితి తీవ్ర ఇబ్బందికరంగా ఉంటుంది.

– వేణు, గురవయ్యగారిపల్లె, లక్కిరెడ్డిపల్లి మండలం

కూలి పడేదెప్పుడో.. కడుపు నిండేదెన్నడో..!

- ఉపాధి నగదు అందక కూలీలకు ఇక్కట్లు
- మండలంలో రూ.1.12 కోట్ల మేర బకాయిలు
- 13 వారాలకు అందాల్సిన వైనం



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

చిన్నమండెం : గ్రామాల్లో ఇప్పటికీ వ్యవసాయం తరువాత అండగా ఉంటోంది గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులే. కానీ రెండు నెలలుగా ఉపాధి నగదు పడకపోవడంతో.. కూలీలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఏ రోజుకారోజు కూలీనాలి పని చేసుకొని జీవనం సాగించే వారు తల్లడిల్లుతున్నారు. ఓ పక్క బకాయిలు అందక, మరోపక్క కూలీ పనులు లేక అవస్థల పాలవుతున్నారు. మండలంలో 8273 మందికి జాబ్‌కార్డులు ఉన్నాయి. వారిలో ఈ ఏడాది 13336 మంది కూలీలు ఉండగా, 1406 మంది పని చేశారు. వారిలో కొన్ని శ్రమశక్తి సంఘాల ఉపాధి కూలీలకు పైసా కూడా బిల్లులు రాలేదు. కొన్ని గ్రామాల్లో 10 వారాలకు మాత్రమే ఉపాధి బిల్లులు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. 13 వారాలకు ఉపాధి కూలీల బిల్లులకు రూ.1.12 కోట్ల మేర బకాయిలు ఉన్నాయి. మండుటెండలో కష్టపడి పని చేసినా.. నేటికీ బిల్లులు రాకపోవడంతో కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో ప్రతి వారానికి ఉపాధి కూలీల బిల్లులు బ్యాంక్‌లో జమ అయ్యేవని వారు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతున్నారు.

ఉపాధి పనుల వివరాలు

జాబ్‌కార్డులు: 8273

పని చేసిన కుటుంబాలు : 1406

కూలీలు : 13336

అందాల్సిన బకాయిలు : రూ.1.12 కోట్లు

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం పోరు



రాయచోటిలో యూటీఎఫ్ జెండా ఆవిష్కరణలో నాయకులు

రాయచోటి అర్బన్ : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం యూటీఎఫ్ నిరంతరం పోరాటం చేస్తోందని ఆ సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.జాబీర్ అన్నారు. పట్టణంలోని అలీ మాబాద్‌వీధిలోని ఉర్దూ ఉన్నత పాఠశాలలో శనివారం యూటీఎఫ్ 51వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నేతలు సురేంద్రారెడ్డి, ప్రసాద్, హఫీజుల్లా, రెడ్డిముని, సుధాకర్, నరసింహారెడ్డి, రాజేంద్ర, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

నందలూరు : నందలూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద యూటీఎఫ్ పతాకాన్ని ఆ సమాఖ్య మండల శాఖ అధ్యక్షుడు ముక్కార హరినాథ్, కార్యదర్శులు కృపానందం, సుధాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడిచిన 50 ఏళ్లలో విద్యా రంగానికి, ఉపాధ్యాయులకు ఎన్నో హక్కులు, సౌకర్యాలను సాధించి పెట్టిన ఘనత యూటీఎఫ్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు షేక్ రౌఫ్‌బాషా, మస్తాన్‌రెడ్డి, శామ్యూల్, శివ వరప్రసాద్, ఐజయ్య, ఇమామ్ బాషా, ఆనంద్, నారాయణ, రెడ్డన్న తదితరులు పాల్గొన్నారు.

పెనగలూరు : పెనగలూరులో యూటీఎఫ్ జెండాను ఆ సమాఖ్య జిల్లా అధ్యక్షుడు బి. హరిప్రసాద్, మండల అధ్యక్షుడు వినోద్ కుమార్ ఎగురవేశారు. ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ కోసం యూటీఎఫ్ కృషి చేస్తోందని వారు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నరసింహారావు, గంగాధర్ బాబు, బి.రమణయ్య, సుబ్బరాయుడు, మహేశ్వర్ నాయుడు, కేవీ రమణయ్య, ఖాదర్ బాషా, వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ సమ్మేళనాలు విజయవంతం చేయండి



గోడ పత్రాలు ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

రాజంపేట రూరల్ : విశాఖపట్నంలో నిర్వహించే ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనాలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు తుమ్మల రామకృష్ణ, ఉపాధ్యక్షులు ఎంఎస్ రాయుడు తెలిపారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో శనివారం సమ్మేళనాల గోడ పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెప్టెంబర్ 1, 2, 3వ తేదీలలో నిర్వహించే ఈ సమ్మేళనాలలో కార్మిక వర్గ సమస్యలపై చర్చించనున్నట్లు తెలియజేశారు. అదే విధంగా సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. అన్ని శాఖలలో ఉన్న కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాగేశ్వరరావు, ఆటో వర్కర్స్ నాయకులు మౌలా, రమణ, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు జమాల్, హమాలీ యూనియన్ నాయకులు రాఘవేంద్ర, లక్ష్మన్న, రామాంజనేయులు, లింగన్న, నరసింహులు, నరసింహ, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం



మాట్లాడుతున్న మాలమహానాడు, అంబేడ్కర్‌సేవా సమితి ప్రతినిధులు

రాజంపేట రూరల్ : అన్నదమ్ముల్లా ఉన్న మాల, మాదిగలను ఎస్సీ వర్గీకరణ పేరుతో విడదీయడాన్ని వ్యతిరేకిస్తూ పోరాటాలు చేపడతామని అంబేడ్కర్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోలంరెడ్డి మల్లికార్జున, మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు లింగం సంజీవ్ తెలియజేశారు. మండల పరిధిలోని కే బోయినపల్లి వద్దనున్న అన్నమయ్య సర్కిల్‌లో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగబద్ధంగా జనగణన ప్రాతిపదిక ప్రకారం మెజార్టీ ప్రజల అభిప్రాయం తీసుకొని వర్గీకరణ చేయాలని కోరారు. రాజకీయ స్వార్థాల కోసం వర్గీకరణ చేపట్టి ఎస్సీల మధ్య చిచ్చుపెడితే సహించబోమని హెచ్చరించారు. వర్గీకరణకు వ్యతిరేకంగా 12న ఉదయం 9 గంటలకు ఆర్‌అండ్‌బీ వద్దనున్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాలలు భారీగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ సేవా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జెట్టి చిరంజీవి, మాలమహానాడు రాష్ట్ర సలహాదారులు భాస్కర్, నాయకులు పందికాళ్ల జయరాం, పిల్లి కన్నయ్య, శ్రీనివాసులు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

కళాశాలల్లో మధ్యాహ్నభోజనం పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకుడు మాధవ్

రైల్వేకోడూరు అర్బన్ : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పునరుద్ధరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాధవ్ డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలల్లో పేద, బడుగు, బలహీన వర్గాల వారు ఎక్కువగా ఉంటారని, కావున వారికి మధ్యాహ్న భోజనం అందించాలని తెలిపారు. అలాగే ఆన్‌లైన్ డిగ్రీ అడ్మిషన్లు రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బాలసుబ్రమణ్యం, ప్రసాద్, రాజ, ప్రభు, కుషల్, భరత్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మదనపల్లె సిటీ: స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వపు విద్యార్థుల సంఘ అధ్యక్షురాలు తేజోవతి మాట్లాడుతూ కాలేజీ అభివృద్ధికి సహకరిస్తామని అన్నారు. కాలేజీలో చదవడం వలన తాము ఉన్నత స్థాయికి చేరుకున్నామని తెలిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు రుణపడి ఉంటామన్నారు. కాలేజ్ ప్రిన్సిపాల్ క్రిష్ణవేణి మాట్లాడుతూ తొలిసారిగా కాలేజీలో పూర్వపు విద్యార్థుల సమావేశం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి కాలేజీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. అధ్యాపకులు మోహన్‌వల్లి, విష్ణుప్రియ, జ్యోతి, పూర్వపు విద్యార్థులు కౌసర్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ

రామాపురం : మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు సోమవారం నుంచి మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారి ప్రభాకర్ తెలిపారు. ఈనెల 12, 13, 14లలో ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ పంచాయతీల పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాలపై శిక్షణ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. మండలంలోని సర్పంచ్‌లు, గ్రామ సచివాలయం పంచాయతీ కార్యదర్శులు, హాజరు కావాలని వివరించారు.